

బైక్ దొంగలు దొరికారు

బైక్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను నంద్యాల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ దొంగలకు లీడర్‌గా ఉంటూ పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు. 8లో▸



బదిలీల నిలుపుదల

'ఏపీఎస్పీ రెండో పటాలంలో బది'లీల'లు' వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు బదిలీల కార్యక్రమం నిలుపుదల చేశారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,631.87
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.272
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,726
అవుట్ ఫ్లో	:10,175

న్యూస్‌రీల్

ప్రశాంతంగా టెట్ ప్రారంభం

- మొదటి రోజు 15 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో టెట్ - 2024 పరీక్ష గురువారం ప్రశాంతంగా ప్రారంభమైంది. జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేయగా మొదటి రోజు రాజీవ్‌గాంధీ ఇంజినీరింగ్ కాలేజీ పరీక్ష కేంద్రంలో మాత్రమే టెట్ పరీక్ష కొనసాగింది. రెండో రోజు శుక్రవారం నుంచి మిగతా ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, నెరవాడ శాంతిరాం ఇంజినీరింగ్ కాలేజీల్లోని కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. గురువారం తెలుగు, కన్నడ, ఉర్దూ, సాంస్కృతిక పరీక్షకు ఉదయం 60 మందికి గాను 51 మంది, మధ్యాహ్నం 60 మందికి గాను 54 మంది హాజరయ్యారు. ఉదయం సెషన్‌కు 9 మంది, మధ్యాహ్నం సెషన్‌కు ఆరుగురు గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులందరూ ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

కిలో టమాట రూ.90

- మార్కెట్‌కు తగ్గిన టమాట సరఫరా

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్‌లోకి టమాట సరఫరా గణనీయంగా తగ్గింది. జిల్లాలోని పత్తికొండ మార్కెట్‌కు క్రమంగా టమాట తాకిడి తగ్గుతోంది. సెప్టెంబర్ 30న పత్తికొండ మార్కెట్‌కు 75 టన్నులకు పైగా టమాట వచ్చింది. ఈ నెల 1 నుంచి టమాట రావడం తగ్గుతోంది. గురువారం 56.33 టన్నుల టమాట వచ్చింది. తాజాగా రైతుబజారులో కిలో టమాట ధర రూ.55/65 పెట్టారు. బయట కిలో టమాట రూ.80 నుంచి రూ.90 వరకు అమ్మకాలు చేస్తున్నారు. కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో రబీ పంట కింద ఇటీవలనే టమాట సాగు చేశారు. ఈ దిగుబడులు మార్కెట్‌లోకి వచ్చే వరకు ధరలు అదుపులోకి వచ్చే అవకాశం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆర్టీసీ పాస్‌ల జారీకి కొత్త సాఫ్ట్‌వేర్

కర్నూలు సిటీ: ఏపీఎస్ ఆర్టీసీలో బస్సు పాసుల జారీకి వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌ను మార్పు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా ప్రజా రవాణా విభాగం 2వ డిపో మేనేజర్ సర్దార్ హుసేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్‌ను ఆధునికీకరిస్తుండటంతో ఈనెల 5, 6 తేదీల్లో బస్ పాసుల జారీ బ్రేక్ పడనుందన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తించాలని, 7వ తేదీ నుంచి యథావిధిగా బస్ పాస్‌ల జారీ చేయడం జరుగుతుందన్నారు.

స్వల్పంగా పెరిగిన ఉల్లి ధర

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధర కాస్త పెరిగింది. మార్కెట్‌కు ఉల్లి తాకిడి కూడా కొంతమేర తగ్గింది. గురువారం మార్కెట్‌కు 245 మంది రైతులు 7,475 క్వింటాళ్ల ఉల్లి విక్రయానికి తీసుకొచ్చారు. కనిష్ట ధర రూ.495, గరిష్ట ధర రూ.4,119 లభించింది. గరిష్ట ధర కొంత మేర పెరిగినప్పటికీ సగటు ధర మాత్రం రూ.2,658 నమోదైంది. ఎక్కువ మంది రైతులు తెచ్చిన ఉల్లికి రూ.1,500 నుంచి రూ.2,800 వరకు మాత్రమే ధర లభించింది. వ్యాపారులు సిండికేట్ అవుతుండటంతోనే ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది.

7 నుంచి జాతీయ తపాలా వారోత్సవాలు

కర్నూలు(అర్బన్): భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు తపాల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జాతీయ తపాలా వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా తపాలా పర్యవేక్షకులు డీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 7వ తేదీన అధిక మొత్తంలో పోస్టల్ మెయిల్ సర్వీసులను ఉపయోగించుకునే వారిని సమావేశపరిచి సత్కరించడం జరుగుతుందన్నారు. 8న స్కూల్ విద్యార్థులకు స్టాంపుల సేకరణపై అవగాహన కార్యక్రమం, థాయ్ ఆఖర్ లెటర్ రైటింగ్ కాంపిటీషన్స్ నిర్వహించనున్నామన్నారు. 9న ప్రపంచ తపాలా దినోత్సవంలో భాగంగా మారథాన్ నడక, మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. 10న అంత్యోదయ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ఆధార్ నమోదు, నవరణ కేంద్రాలను నిర్వహిస్తామన్నారు. 11న సుకన్య సమృద్ధి ఖాతాలు, పోస్టాఫీసు అందిస్తున్న ఇతర చిన్న మొత్తాల పొదుపు ఖాతాలు మేళాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సీబీఎస్ఈ.. సర్కారు కసి



జిల్లాలో శిరివెళ్ల మోడల్ స్కూల్‌లో సీబీఎస్ఈ విద్యాబోధన

పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టారు. పేదల పిల్లలు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) బోధనను అమలు చేశారు. తమ పిల్లలకు ఖరీదైన విద్య ఉచితంగా అందుతుందని పేద తల్లిదండ్రులు సంతోషించారు. అయితే, ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 'కూలోడికి మగపిల్లాడా' అన్న చందంగా ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై విద్యార్థి సంఘాల నాయకులు, విద్యావేత్తలు, పిల్లలు తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన నిలిపివేత
- ప్రశ్నార్థకంగా మారిన 6వేల మంది విద్యార్థుల భవిష్యత్తు
- ప్రభుత్వం తీరుపై విద్యార్థి నాయకులు, విద్యావేత్తలు ఆగ్రహం
- నిరుపేద విద్యార్థులకు దూరమైన ఖరీదైన విద్య
- మళ్లీ మొదటికి ప్రభుత్వ స్కూళ్ల పరిస్థితి

జిల్లాలో సీబీఎస్ఈ విధానం అమలవుతున్న పాఠశాలల సంఖ్య : 69		
పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య : 6343		
కేజీబీవీ పాఠశాలలు - 27	ఏపీఎంఎస్ - 19	జెడ్పీ పాఠశాలలు - 8
ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్ - 6	ప్రభుత్వ పాఠశాలలు - 5	ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ - 2
ఏపీటీ డబ్ల్యూఆర్ఎస్ - 2		

నంద్యాల (న్యూటౌన్): పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో సీబీఎస్ఈ విద్యాబోధన సాగుతోంది. ఖరీదైన ఈ విద్య వాటిలో చదివే పిల్లలకు మాత్రమే అందుతుంది. అయితే, ఈ విద్యాబోధనను పేదల పిల్లల దరికి చేర్చాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో అమలుకు శ్రీకారం చుట్టారు. దీంతో జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరంలో 69 ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. నాడు ఈ విధానాన్ని 8వ తరగతి నుంచి ప్రారంభించారు. ఆపై 9వ తరగతి, ఆ తరువాత సంవత్సరం 10వ తరగతికి కొనసాగించారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఆ 69 పాఠశాలల విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు సీబీఎస్ఈ విధానంలో రాయాల్సి ఉంది. అయితే, నాలుగునెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు సీబీఎస్ఈని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు దాటిన తరువాత ప్రకటించిన ఈ నిర్ణయంతో పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. పది, ఇంటర్ పూర్తి చేసి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించే అవకాశాన్ని ఆ విద్యార్థులు కోల్పోవాల్సి వచ్చింది.

మూడేళ్ల శ్రమ వృథా

సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. అందులో మెలకువలను గ్రహించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనలను సాగిస్తున్నారు. తీరా వ్యవస్థ గాడిలో పడిన తరువాత ప్రభుత్వం సీబీఎస్ఈ సిలబస్ రద్దు నిర్ణయంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీంతో పాటు అకడమిక్ మధ్యలో ఈ నిర్ణయం తీసుకోవడాన్ని పలువురు తప్పు పడుతున్నారు. వారి మూడేళ్ల కష్టం బూడిదలో పోసిన పన్నీరేనా.. అని మండిపడుతున్నారు. పైగా ఇప్పటి వరకు సీబీఎస్ఈ సిలబస్‌ను చదువుకున్న విద్యార్థులకు తెలుగు, హిందీ సబ్జెక్టులపై పెద్దగా అవగాహన ఉండదు. ప్రస్తుతం ఆ రెండు సబ్జెక్టులతో పిల్లలు కుస్తీపడాల్సి వస్తుందని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు.

మళ్లీ మొదటికి ప్రభుత్వ స్కూళ్ల పరిస్థితి

కూటమి ప్రభుత్వం ఈ మూడు నెలల్లో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మళ్లీ మొదటికి రానుంది. సీబీఎస్ఈ విధానం రద్దుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసంబంధ నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలలు మళ్లీ తిరోగమనం వైపు అడుగులు పడుతున్నాయని విద్యావేత్తలు మండిపడుతున్నారు.

సీబీఎస్ఈ వల్ల కలిగే ప్రయోజనాలు

- సీబీఎస్ఈ చదివిన విద్యార్థులు దేశంలో ఎక్కడికి వెళ్లినా మంచి గుర్తింపు పొందుతారు.
- ప్రముఖ విద్యా సంస్థలైన ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ఎయిమ్స్, జిప్‌మర్, సీఎంసీ వంటి సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో రాణిస్తారు.
- ఒత్తిడికి లోనుకాకుండా తన ఆసక్తికి అనుగుణంగా విద్యార్థులు చదువులు కొనసాగిస్తారు.
- సీబీఎస్ఈ వల్ల ఏ రాష్ట్రానికి వెళ్లినా చదువుకునేందుకు ఇబ్బంది ఉండదు.
- సమస్యలను తనంతట తాను పరిష్కరించుకునే సామర్థ్యం విద్యార్థుల్లో పెంపొందుతుంది.

సీబీఎస్ఈ ఎంతో ఉపయోగకరం



ప్రస్తుతం నడుస్తున్న పోటీ ప్రపంచంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సీబీఎస్ఈ విధానం ఎంతో ఉపయోగకరం. సీబీఎస్ఈ అమలయ్యే పాఠశాలల పర్యవేక్షణ కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వెళ్తుంది. సీబీఎస్ఈ విధానాన్ని ప్రభుత్వం కొనసాగించాలి.

–వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, నంద్యాల

విద్యార్థులపై తీవ్ర ప్రభావం



ప్రభుత్వాలు ఏవైనా పేదల పిల్లలకు మంచి విద్యనందించాలి. అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని. అయితే, కూటమి సర్కారు సర్కారు బడుల్లో అమలవుతున్న సీబీఎస్ఈ విధానాన్ని రద్దు చేయడం సరికాదు. దీని వల్ల పేదల పిల్లలు జాతీయ స్థాయి పోటీపరీక్షల్లో రాణించలేరు.

–శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా సెక్రటరీ, నంద్యాల

సీబీఎస్ఈ రద్దు సరికాదు



ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన కూటమి సర్కారు నీరుగార్చే చర్యలు తీసుకుంటోంది. మూడేళ్ల నుంచి అమలవుతున్న సీబీఎస్ఈని ఉన్నట్లుండి రద్దు చేయడం మంచిది కాదు. ఇప్పటి వరకు ఆ సెంట్రల్ సిలబస్ చదువుకున్న విద్యార్థులు మళ్లీ స్టేట్ సిలబస్‌కు మారాలంటే ఇబ్బందవుతుంది.

–నాగరాముడు, ఏబైవైఎఫ్ఐ జిల్లా సెక్రటరీ, నంద్యాల

అంతర్గత మూల్యాంకనానికి ప్రాధాన్యమివ్వాలి



సీబీఎస్ఈ విధానంలో మాదిరిగా అంతర్గత మూల్యాంకన విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే అన్ని పాఠశాలల్లో 30 శాతం ఇంటర్నల్ మార్కుల వెయిటేజ్ ప్రవేశ పెట్టాలి. దీంతో విద్యార్థుల సమగ్ర మూర్తిమత్వాన్ని అంచనా వేయడానికి వీలు కలుగుతుంది. ఈ దిశగా కూటమి సర్కారు చర్యలు తీసుకోవాలి తప్ప సీబీఎస్ఈని రద్దు చేయరాదు.

– రవీంద్రనాయక్, గిరిజన విద్యార్థి సమాఖ్య రాయలసీమ ఇన్‌చార్జ్, నంద్యాల

మద్యం దుకాణాలకు మందకొడిగా దరఖాస్తులు



శ్రీదేవి, డీసీ

కర్నూలు: మద్యం రిటైల్ వ్యాపారం తిరిగి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు దరఖాస్తుల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. టెండర్ల ప్రక్రియ నిర్వహించి త్వరితగతిన దుకాణాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు షెడ్యూల్ విడుదల చేసిన ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాలను అనుసరించి ప్రణాళిక అమలు చేసేందుకు కసరత్తు ముమ్మరం చేశారు. ఈ నెల 1 నుంచి మద్యం దుకాణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ గాంధీ జయంతి, బ్యాంకులకు సెలవు, అమావాస్య వంటి కారణాలతో రెండు రోజులుగా ఎలాంటి దరఖాస్తులు రాలేదు. నంద్యాల జిల్లాలో 7 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 105 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ జారీ అయింది. అయితే కేవలం బనగానపల్లె, నంద్యాల పట్టణంలోని మూడు దుకాణాలకు ఆరు దరఖాస్తులు మాత్రమే సమర్పించారు. అలాగే కర్నూలు జిల్లాలో 7 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 99 దుకాణాలు ఉండగా 23 దుకాణాలకు 76 దరఖాస్తులు ఆఫ్‌లైన్‌లో సమర్పించారు. గతంలో మద్యం దుకాణాలు నిర్వహించిన వ్యాపారులు దుకాణాలు దక్కించుకునేందుకు ముందుకొస్తున్నారు. గతంలో ఏళ్ల తరబడి మద్యం దుకాణాలు నిర్వహిస్తూ, వాటిలో పనిచేస్తూ ఉపాధి పొందిన వారు కూడా లక్కీడిప్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పెట్టుబడులు పెడుతుండటం గమనార్హం. అయితే దరఖాస్తుల ప్రక్రియ మందకొడిగా సాగుతుండటంతో గురువారం ఎక్సైజ్ జిల్లా అధికారులు కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్‌తో కలసి చర్చించారు.

పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ

దరఖాస్తుల స్వీకరణ, టెండర్ల ప్రక్రియ అంతా పారదర్శకంగా ఉంటుంది. కలెక్టర్ సమక్షంలో టెండర్లు తీసి లైసెన్స్‌దారులను ఖరారు చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలను అనుసరించి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీదేవి, డీసీ

ఉపాధి పనుల పురోగతిపై శ్రద్ధ పెట్టండి


- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి, అధికారులు

నంద్యాల(అర్బన్): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎంపీడీవోలు, ఏపీఓలు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉపాధి హామీ పథకం ప్రగతి లక్ష్యాలపై డ్వామా పీడీ జనార్దన్ రావుతో కలసి క్లస్టర్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. లేబర్ బడ్జెట్ మొబలైజేషన్‌లో నందికొట్కూరు, దొర్నిపాడు, జూపాడుబంగ్లా, అవుకు, ఉయ్యాలవాడ, తదితర మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు మెరుగుపరచుకొని కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. హార్టికల్చర్ కింద గడివేముల, దొర్నిపాడు, సంజామల, కొలిమిగుండ్ల, ప్యాపిలి, డోన్, బేతంచర్ల మండలాలు వెనకబడి ఉన్నాయని ఏదో కారణాలు చెప్పి తప్పించుకోవడం సరికాదన్నారు. పూర్తిచేసిన పనులపై థర్డ్ పార్టీతో విచారణ చేయిస్తామన్నారు. మోడల్ స్కూల్, కస్తూర్బా స్కూల్ ఇతర ప్రభుత్వ సంస్థల ఆవరణాల్లో సంస్థాగత ప్లాంటేషన్ కింద కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. 55 ఫారం పాండ్లకు గాను 44 పూర్తి చేశారని అసంపూర్తిగా ఉన్న ఫారం పాండ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనుల్లో జీరో శాతం పురోగతి ఉందన్నారు.

ఆకట్టుకున్న కళాకారుల శక్తి రూపాల ప్రదర్శన



దేవీ వైభవం.. ఉత్సవ శోభితం



భృంగివాహన సేవ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

- శ్రీగిరిలో దసరా మహోత్సవాలు ప్రారంభం
- శాస్త్రోక్తంగా ఉత్సవాలకు అంకురార్పణ
- శైలపుత్రిగా భ్రామరీ దర్శనం, భృంగివాహనంపై మల్లన్న విహారం
- వర్షంతో గ్రామోత్సవం రద్దు



అంకురార్పణ పూజల్లో పాల్గొన్న ఈఓ పెద్దిరాజు దంపతులు, అర్చకులు తదితరులు

శ్రీశైలంటెంపుల్: ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం కలసి వెలిసిన శ్రీశైల మహాక్షేత్రంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం 8 గంటలకు వేదమంత్రోచ్చరణల మధ్య మంగళవాయిద్యాల నడుమ అర్చకులు, వేద పండితులు ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. పది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు ఈ నెల 12వ తేదీతో ముగుస్తాయి. మొదటి రోజు గురువారం ముందుగా శ్రీశైల దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు దంపతులు ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రవేశం చేశారు. ఈ ఉత్సవాలకు నాందిగా ఉదయం 8 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం, గణపతిపూజ, దీక్షాసంకల్పం, కంకణపూజ, కంకణధారణ, చండీకలశస్థాపన తదితర పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవ సంకల్పాన్ని పఠించారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శైలపుత్రిగా శ్రీశైల భ్రామరీ..

దసరా నవరాత్రోత్సవాలలో చేపడుతున్న నవదుర్గ అలంకారంలో భాగంగా గురువారం రాత్రి 7.30 గంటలకు శ్రీశైల భ్రమరాంబను శైలపుత్రి స్వరూపంలో అలంకరించారు. అమ్మవారి ఆలయం ఎదుట ప్రత్యేక వేదికపై అమ్మవారిని ఆశీనులను చేసి ప్రత్యేక పూజాదికాలు చేపట్టి హారతులిచ్చారు. నవదుర్గలలో ప్రథమ రూపమైన శైలపుత్రి దేవిని పూజించడంతో సర్వత్రా విజయాలు లభిస్తాయని, ముత్తైదువులకు ఐదవతనం వృద్ధి చెందుతుందని పండితులు చెబుతున్నారు.

భృంగివాహనసేవ

ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేసి భృంగివాహనంపై ఉంచి పూజలు చేపట్టారు. వర్షం కారణంగా గ్రామోత్సవం రద్దయింది. రెండవ రోజు శుక్రవారం అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో, స్వామిఅమ్మవార్లు మయూరవాహనంపై దర్శనమివ్వనున్నారు.

మల్లన్న లడ్డూ ప్రసాదాల నాణ్యత పరిశీలన



లడ్డూ నాణ్యతను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని స్వామివారి ఆలయంలో ప్రసాదాలు తయారు చేసే లడ్డూపోటులో నంద్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. గురువారం శ్రీశైలం చేరుకున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు షేక్ ఖాశింవలి, ఓ.వి.రాముడు లడ్డూ తయారీని పరిశీలించారు. లడ్డూలో వినియోగించిన పదార్థాలు, దేవస్థానానికి సరఫరా అవుతున్న నెయ్యి నాణ్యతను పరిశీలించారు. అలాగే లడ్డూ కౌంటర్ల వద్ద భక్తులకు అందజేస్తున్న లడ్డూలను పరిశీలించారు. గత వారంలో కూడా పడితరానికి సరఫరా అయ్యే వస్తువులు, నెయ్యి శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్‌లోని నాచారం ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించామని అధికారులు తెలిపారు. అలాగే క్షేత్ర పరిధిలోని గణేష్ ఫుడ్‌కోర్టు, పలు హోటళ్ల తనిఖీ చేసి వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ఆహార పదార్థాల తయారీకి వినియోగించే వస్తువులు పూర్తి నాణ్యతతో ఉండాలని, ఆహార పదార్థాలను, తిను బండారాలను తయారు చేసేటప్పుడు శుచీ, శుభ్రత పాటించాలని సూచనలు చేశారు. అంతేకాకుండా శ్రీశైలంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్ నిలుపుదల చేయడంతో వాటి స్థానంలో గాజు సీసా వాటర్‌ను వినియోగిస్తున్న తరుణంలో వాటి నాణ్యతను కూడా పరిశీలించామని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

శనగ విత్తనాలకు రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్‌లో శనగ విత్తనాల కోసం రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులు నాన్ సబ్సిడీ అమౌంటు చెల్లిస్తే ఏపీ సీడ్స్ విత్తనాలను సరఫరా చేస్తోంది. ఇప్పటివరకు ఏపీ సీడ్స్ ఆర్ఎస్‌ఏల్లో శనగ విత్తనాలను అందుబాటులో ఉంచలేదు. హడావుడిగా పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు విత్తనాల పంపిణీ చేపడుతామని చెప్పడంతో ఏపీ సీడ్స్ మద్దికెరలో కొన్ని ప్యాకెట్లను సిద్ధం చేసింది. రైతుకు గరిష్ఠంగా 5 ఎకరాలకు (ఎకరానికి 40 కిలోలు చొప్పున) విత్తనాలు సబ్సిడీపై ఇస్తారు. నల్ల రేగడి నేల కలిగిన రైతులకే విత్తనాలు పంపిణీ చేస్తారు.

పోస్టల్ శాఖ ఉత్తరాల పోటీ

కర్నూలు న్యూసిటీ: ఉత్తరాలపై ఆసక్తి పెంచేందుకు పోస్టల్ శాఖ నిర్వహిస్తున్న ధాయ్ ఆఖర్ లెటర్ రైటింగ్ పోటీలో ప్రజలందరూ పాల్గొనాలని జిల్లా తపాలా పర్యవేక్షకులు జి.జనార్దన్‌రెడ్డి కోరారు. 'ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్' అంశంపై పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలకు వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు, జాతీయ స్థాయి విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.25 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు సమీప పోస్టల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ఆర్‌యూ లా సెమిస్టర్ ఫలితాలు విడుదల


కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జూన్‌లో నిర్వహించిన లా 3, 5 సంవత్సరాల 1, 3 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఫలితాలు https://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్‌కు 189 మందికి 153, మూడో సెమిస్టర్‌కు 199 మందికి 159 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్‌కు 54 మందికి 32, మూడవ సెమిస్టర్‌కు 44 మందికి 37 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని తెలిపారు.

- మూడేళ్ల ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ 68 మందికి 38, మూడో సెమిస్టర్‌కు 45 మందికి 17 మంది, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ 16 మందికి 9, మూడవ సెమిస్టర్ 38 మందికి 21 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.


మంత్రాలయంలో పూజలందుకుంటున్న మంచాలమ్మ


ముత్యాలపాడులో రాజరాజేశ్వరి అలంకరణలో..

కర్నూలు గణేష్‌నగర్‌లో దుర్గామాత విగ్రహం




ఆస్పరిలో బాలాత్రిపుర సుందరి అలంకరణలో గాయత్రీ మాత


నందవరంలో శైలపుత్రిగా చౌడేశ్వరిదేవి



నందికొట్కూరులో బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణ

జగన్మాతా పాహిమాం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా సుందరంగా అలంకరించిన మండపాల్లో దుర్గామాతను కొలువుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో అమ్మవారు మొదటిరోజు వివిధ రూపాల్లో దర్శనమివ్వగా భక్తులు దర్శించుకుని తన్మయత్వం చెందారు. ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

– సాక్షి నెట్‌వర్క్


గడివేములలో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత


కర్నూలు గీతా మందిరంలో అమ్మవారి పారాయణం చేస్తున్న బాలికలు


పత్తికొండలో రాజరాజేశ్వరీ దేవి అలంకరణ


ఎమ్మిగనూరులో బాలాత్రిపుర సుందరి అలంకరణ


నంద్యాలలో స్వర్ణాభరణ అలంకరణలో కాళికాంబా దేవి


ప్యాపిలిలో స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి


ఆదోనిలో పసుపు, కుంకుమ అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ

మహానందిలో శరన్నవరాత్రుల శోభ


మహానందిలో సూర్యప్రభ వాహనంపై అమ్మవారి గ్రామోత్సవం

మహానంది: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహానంది ఆలయంలో తొలిరోజు విశేష పూజలు, రుద్ర, చండీహోమాలు నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు, రుత్వికులు ఉదయం నుంచి రాత్రి వరకు శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. స్థానిక శతచండీయాగశాలలో రుద్రహోమం, చండీహోమం పూజలు జరిగాయి. ఆలయంలో కొలువైన కామేశ్వరీదేవి మూలమూర్తికి వేకువజామున శ్రీచక్రార్చన పూజలు, మహామంగళ హారతులు పట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు పూజల్లో పలు ప్రాంతాలకు చెందిన భక్తులు రూ.13,116 చెల్లించి ఉభయదాతలుగా పాల్గొన్నారు.

సూర్యప్రభపై శైలపుత్రి

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహానందిలో కామేశ్వరీదేవి అమ్మవారు మొదటి రోజు గురువారం రాత్రి శైలపుత్రిదుర్గగా దర్శనమిచ్చారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. సూర్యప్రభ వాహనంపై అమ్మవారి గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు పాల్గొని తరించారు.


శ్రీచక్రార్చన పూజలు చేస్తున్న పండితులు

ముగ్గురు బైక్ దొంగల అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో బైక్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలు టూటౌన్ పోలీసులకు చిక్కారు. బుధవారం రాత్రి ఎస్‌బీఐ కాలనీలోని సింగ్ అపార్ట్‌మెంట్ వద్ద గస్తీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ముగ్గురు యువకులు కనిపించారు. అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న బైక్‌కు సంబంధించిన పత్రాలు అడగగా లేవని చెప్పారు. లోతుగా విచారిస్తే రాత్రి సమయాల్లో తాము బైక్‌లు చోరీ చేస్తున్నామని అంగీకరించారు. దీంతో వారు గతంలో దొంగిలించిన 5 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఇస్మాయిల్ తెలిపారు. ఈ దందాకు లీడర్‌గా వ్యవహరిస్తున్న షిండే చంద్ర పరారీలో ఉన్నాడని అతని కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు.

మరణంలోనూ వీడని పేగుబంధం

- కుమారుడి మృతి తట్టుకోలేక తనువు చాలించిన తల్లి


వెంకటేశులు, నారాయణమ్మ (ఫైల్)

మద్దికెర: స్థానిక ఎస్సీ కాలనీలో ఎల్లిపోగుల వెంకటేశులు (53) గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందడంతో తట్టుకోలేక తల్లి నారాయణమ్మ (80) తనువు చాలించింది. నారాయణమ్మకు ఇద్దరు కూతుళ్లు, ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు వెంకటేశులు గురువారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలిసినప్పటినుంచి తల్లి నారాయణమ్మ రోదిస్తూనే ఉంది. సాయంత్రం 3 గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందిందని కుటుంబసభ్యులు తెలిపారు. తల్లి, కుమారుడు ఒకేరోజు మృతి చెందడంతో కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి తదితరులు వారి భౌతిక కాయాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ప్రాణం తీసిన అనుమానం

- నిద్రిస్తున్న భార్యను గొడ్డలితో నరికి హత్య చేసిన భర్త
- పరారీలో నిందితుడు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: జీవితాంతం తోడుంటానని బాస చేసిన భర్తే అనుమానంతో భార్యను అంతమొందించాడు. ఈ ఘటన గురువారం కనకాద్రిపల్లె ఎస్సీ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పార్వతమ్మ (32)కు అనంతపురం జిల్లా యాడికి మండలం కోన ఉప్పలపాడుకు చెందిన రామ్మోహన్‌తో పదహారేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు. మొదట్లో వీరి సంసారం సాఫీగా సాగింది. తర్వాత రామ్మోహన్ భార్యపై అనుమానం పెంచుకొని తరచూ గొడవ పడుతుండేవాడు.ఈ క్రమంలో కోన ఉప్పలపాడు నుంచి వచ్చి ఏడేళ్లుగా కనకాద్రిపల్లెలోనే ఉంటున్నారు. డ్రైవర్‌గా పని చేస్తున్న రామ్మోహన్ భార్యపై పూర్తి అనుమానం పెంచుకున్నాడు. బుధవారం రాత్రి ఇద్దరు పిల్లలు అవ్వాతాతల వద్ద నిద్రించగా, ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న భార్యను తెల్లవారుజామున గొడ్డలితో తలపై నరకడంతో అక్కడిక్కడే మృతి చెందింది. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని అక్కడే వదిలి పరారయ్యాడు. తెల్లవారాక కుటుంబ సభ్యులు గమనించే సరికి పార్వతమ్మ మంచంపై రక్తపు మడుగులో నిర్జీవంగా పడి ఉంది. సమాచారం అందుకున్న సీఐ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలను అడిగి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

రుద్రవరం: కోటకొండ గ్రామంలోని ట్యాంకు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న లక్ష్మీదేవి అనే మహిళను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఆమె వద్ద 45 మద్యం బాటిళ్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): వైద్య పరీక్షలకు సంబంధించిన నివేదికలను ల్యాబ్ టెక్నీషియన్లు త్వరగా ఇస్తే రోగికి వీలైనంత త్వరగా చికిత్స అందించేందుకు వీలవుతుందని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు అన్నారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీలోని ఓల్డ్ క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో జిల్లాలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు సంబంధించి పాజిటివ్ వస్తే వీలైనంత త్వరగా రిపోర్టును వైద్యులకు అందజేసేలా చూడాలన్నారు. దీనివల్ల సదరు రోగికి అవసరమైన చికిత్సను అందించి త్వరగా కోలుకునేలా చేయవచ్చని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ.. జిల్లాలో పనిచేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్లు మలేరియా, డెంగీ, క్షయ, ఇతర వ్యాధినిర్ధారణ పరీక్షలను క్వాలిటేటివ్‌గా నిర్వహించాలన్నారు. ఆ రికార్డులు, రిపోర్ట్స్ సక్రమంగా నిర్వహించి వివరాలను అదే రోజు సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజు, డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ మల్లికార్జున్‌రెడ్డి, ఏఎంఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ


విద్యార్థినికి మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కును అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో హోంగార్డులుగా పనిచేస్తున్న వారి పిల్లలు చదువులో బాగా రాణించి అందరికీ స్ఫూర్తిగా నిలవాలని ఎస్పీ బిందుమాధవ్ సూచించారు. ఈ మేరకు గురువారం 38 మంది హోంగార్డు కుటుంబాల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, మెడిసిన్, పీజీ, డిప్లొమా, బీటెక్ తదితర కోర్సులలో ప్రతిభ కనబరచిన వారికి హోంగార్డు వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.1000, రూ.2000 ప్రకారం మెరిట్ స్కాలర్‌షిప్‌లను స్థానిక కార్యాలయంలో అందజేశారు. హోంగార్డుల పిల్లలు చదువులో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం కాంట్రిబ్యూషన్ ఫండ్ చెక్కులను రూ.2 లక్షల చొప్పున ఇద్దరికి, మ్యారేజ్ గ్రాంట్ చెక్కులు రూ.5 వేల చొప్పున నలుగురికి అందజేశారు. సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్, డీఎస్పీ కృష్ణమోహన్, హోంగార్డ్స్ ఆర్ఐ జావెద్ పాల్గొన్నారు.

రెండో పటాలంలో బదిలీల నిలుపుదల

- బెటాలియన్స్ మూడో రేంజ్ ఇన్‌చార్జ్ డీఐజీ మెమో జారీ

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలం కమాండెంట్ రవిశంకర్ గత నెల 30వ తేదీన పదవీ విరమణ పొందారు. అందుకు ఒక్కరోజు ముందు 11 మంది ఏఆర్ ఎస్ఐలు, 25 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 64 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. బదిలీ వ్యవహారంలో ఆర్ఐ, హెడ్ కానిస్టేబుల్ చక్రం తిప్పి భారీ ఎత్తున డబ్బులు వసూలు చేశారన్న ఫిర్యాదుల నేపథ్యంలో 'ఏపీఎస్పీ రెండో పటాలంలో బది'లీల'లు' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం వెలువడింది. దీనిపై ఏపీఎస్పీ బెటాలియన్స్ రేంజ్–3 ఇన్‌చార్జ్ డీఐజీ రాజకుమారి స్పందించారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు బదిలీల కార్యక్రమం నిలుపుదల చేయాలని ఆదేశిస్తూ గురువారం రెండో బెటాలియన్ ఇన్‌చార్జ్ కమాండెంట్‌కు ఆన్‌లైన్ ద్వారా మెమో జారీ చేశారు. ఈ అంశం పటాలంలోని ఉద్యోగుల్లో చర్చనీయాంశం కాగా బయటి కంపెనీల్లో పనిచేస్తూ అధికారులకు ముడుపులు ఇచ్చి హెడ్ క్వార్టర్ కంపెనీకి బదిలీ చేయించుకున్న అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపితే పరిస్థితి ఏంటనే దానిపై కొందరు చర్చించుకుంటుండగా ఏళ్ల తరబడి బయటి కంపెనీల్లో ఉద్యోగం చేస్తున్న వారు తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బదిలీల్లో జరిగిన అవకతవకలపై ఉన్నతాధికారులు శాఖాపరంగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కొందరు ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

డయేరియా కలకలం

- కలుషిత ఆహారమే కారణమా?
- నంద్యాల, ఆళ్లగడ్డ పట్టణాల్లో చికిత్స పొందుతున్న బాధితులు
- రామచంద్రాపురంలో వైద్య శిబిరం ఏర్పాటు

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురంలో డయేరియా కలకలం రేపుతుంది. గ్రామంలో 30 మందికి పైగా విరేచనాలతో అస్వస్థతకు గురై ఆళ్లగడ్డ, నంద్యాల పట్టణాల్లోని ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు.

ఆహారం వికటించడమే కారణమా?

గ్రామంలో మూడు రోజుల క్రితం వరుసగా మూడు కుటుంబాల్లో వ్యక్తులు చనిపోవడంతో కర్మకాండలు నిర్వహించారు. వీటిలో రెండు కుటుంబాల వారు సెప్టెంబర్ 29, 30 తేదీల్లో ఆళ్లగడ్డలోని ఓ హోటల్ నుంచి క్యాటరింగ్ ద్వారా భోజనాలు తెప్పించి బంధువులకు వడ్డించారు. భోజనం తిన్నవారిలో కొందరికీ అక్టోబర్ 1వ తేదీ రాత్రి నుంచి విరేచనాలు మొదలుకావడంతో స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకున్నారు. తర్వాత విరేచనాలు అధికం కావడంతో చికిత్స కోసం నంద్యాల, ఆళ్లగడ్డకు తరలివెళ్లారు. ఆహారం తిన్న 20 కుటుంబాల్లోని 30 మంది అస్వస్థతకు గురికావడంతో నాణ్యత లేని ఆహారం వల్లే విరేచనాలు వచ్చి ఉండవచ్చని వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

గ్రామంలో పలువురు అస్వస్థతకు గురికావడంతో వైద్యులు నాగేంద్ర, రుహుల్లాఖాన్ గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వరుసగా మూడు రోజుల పాటు కలుషిత ఆహారం తీసుకోవడంతోనే ఇలా జరిగినట్లు అనుమానిస్తున్నట్లు చెప్పారు. అంతేగాక గ్రామంలో కర్మకాండలు జరిగితే గ్రామస్తులంతా తప్పని సరిగా భోజనాలు చేయాలని ఆనవాయితీ ఉంది. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేదని, బాధితులు క్రమంగా కోలుకుంటున్నారని వైద్యాధికారులు తెలిపారు.


ఇంటింటి సర్వే ద్వారా గ్రామస్తుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది



ఈ చిత్రంలో వైద్య చికిత్స పొందుతున్న వ్యక్తి అంజనేయులు. రామచంద్రాపురంలో నివాసం ఉంటున్నాడు. ఈయన వయస్సు 45 ఏళ్లు కాగా వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో ఇటీవల జరిగిన కర్మకాండలో పాల్గొని అక్కడ వడ్డించిన ఆహారం తినడంతో మరుసటి రోజు నుంచి విరేచనాలు అధికమై అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు ఆందోళన చెంది నంద్యాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మూడు రోజుల నుంచి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కలుషిత ఆహారం వల్లే అస్వస్థతకు గురైనట్లు భావిస్తున్నారు.